సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



ఎరువు.. మించితే బరువు
దాళ్వా సాగులో రైతులు అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.
8లో ▸

నేటి నుంచి విద్యుత్ సదస్సులు
ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో గురువారం నుంచి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.
8లో ▸



ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి
ప్రతి వ్యక్తి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సూచించారు.
8లో ▸

న్యూస్‌రీల్

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



నారాయణస్వామి రెడ్డి, డీఎస్పీ

భీమవరం: భీమవరం పోలీసు సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, జూదాల నివారణలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వి.నారాయణస్వామిరెడ్డి అన్నారు. బుధవారం భీమవరం డీఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన భీమవరం ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేస్తానన్నారు. ఒంగోలు నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు రాగా.. ఇప్పటివరకు ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన బండారు శ్రీనాథ్ కుప్పం బదిలీపై వెళ్లారు.

ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ

భీమవరం: ఐటీఐ పూర్తిచేసిన గ్రామీణ ప్రాంతాల వారికి ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ కోర్సు, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన వారికి ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ లీడ్ టెక్నీషియన్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ ఎస్.శివప్రసాద్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసాపురం మండలం పెదమైనవానిలంకలోని స్కిల్ కళాశాలలో ఇచ్చే శిక్షణలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, శిక్షణ సామగ్రి అందజేస్తామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్, డీడీయూ–జీకేవై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణకు 18–35 మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఆరు ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా జిరాక్స్ అందజేయాలన్నారు. వివరాలకు సెల్ 79814 08883, 91105 77979 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పీఎస్‌వీఎంఎస్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో బంగారు పతకం



జాతీయ పోటీల్లో పాల్గొన్న కోడూరి పవన్

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా గుండుగొలనుకు చెందిన కోడూరి పవన్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈనెల 4, 5 తేదీల్లో కేరళలోని కాలికట్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో సత్తాచాటాడు. కాకినాడలో బీఎస్సీ చదువుతున్న పవన్ నన్నయ వర్సిటీ నుంచి పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 1,398 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షలకు బుధవారం 1,398 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని 12 కేంద్రాల్లో ఉదయం 897 మందికి 776 మంది, మధ్యాహ్నం 691 మందికి 622 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు.

ఏలూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యారంగంలో ఏలూరు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఏలూరు డీఈఓ కార్యాయలంలో బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక ప్రణాళిక ఉందని, జిల్లాలో విద్యారంగం మరింత అభివృద్ధికి తగిన కార్యాచరణ చేపడతామన్నారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా కృషిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహనరావు, నాయకులు పీజే కెనడీ, తోట రాబర్ట్, పెదపాడు ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, పీఆర్‌టీయూ నాయకులు పువ్వుల ఆంజనేయులు, ఎంటీఎస్ టీచర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్, ఆపస్ జిల్లా నాయకులు రాజ్‌కుమార్, శ్యాంసుందర్ ఉన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- తుది దశకు ఖరీఫ్ ధాన్యం సేకరణ
- వారంలోపే చెల్లింపులు
- రూ.897.37 కోట్ల ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాల్లో జమ
- సర్వత్రా అన్నదాతల హర్షం



ఖరీఫ్ ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

ఖరీఫ్ వరి సాగు 2.13 లక్షల ఎకరాలు	ధాన్యం సేకరణ 4.24 లక్షల టన్నులు
రైతుల సంఖ్య 68,163 మంది	ధాన్యం విలువ రూ. 924 కోట్లు
రైతుల ఖాతాల్లో సొమ్ముల జమ రూ. 897.37 కోట్లు	గోనెసంచులు, రవాణా, లేబర్ చార్జీల చెల్లింపు రూ. 24.50 కోట్లు

సాక్షి, భీమవరం: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ తుది దశకు చేరుకుంది. ధాన్యం సేకరణలో దళారుల జోక్యానికి అడ్డుకట్ట వేసిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సొమ్ములు సత్వర చెల్లింపులకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ధాన్యం సేకరించిన మూడు వారాలు వరకు సొమ్ములు చెల్లించేందుకు గడువు ఉన్నా వారంలోపు రైతుల ఖాతాలకు జమచేయడం ద్వారా వారిపై చిత్తశుద్ధిని చాటుతోంది.

అన్నదాతలకు అండగా..
జిల్లాలోని 2.13 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగుచేశారు. పంట చివరి దశలో మిచాంగ్ తుపాను రైతులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో ముందుగానే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలు ద్వారా నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగారు. ఈదురుగాలులు, ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో 289 గ్రామాల్లోని 30,459 మంది రైతులకు చెందిన 37,118 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రత్యేక బృందాలు లెక్కతెల్చాయి. ముందుగా వరికోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం, పెనుగొండ మండలాల్లో పంట నష్టం తక్కువగా ఉండగా నరసాపురం, పాలకొల్లు, పోడూరు, ఆచంట తదితర మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది.

నిబంధనలు సడలించి..
సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో 264 ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణ చేశారు. దళారులు, కమీషన్ వ్యాపారుల దోపిడీకి ఎక్కడా ఆస్కారం లేకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలును పారదర్శకంగా నిర్వహించింది. ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పొలాల్లోకి వెళ్లి తేమ శాతం శాంపిల్స్ సేకరించి రైస్‌మిల్లులకు తరలించేవారు. తుపాను సమయంలో రైతులు నష్టపోకుండా సడలింపులు ఇచ్చి ఆఫ్‌లైన్‌లో కళ్లాల్లోని 45 వేల టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు.

సత్వర చెల్లింపులు : ధాన్యం సేకరణకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ధాన్యం సొమ్ములను రైతుల ఖాతాలకు జమచేసేందుకు మూడు వారాలు (21 రోజులు) గడువుంది. కాగా సాంకేతికపరమైన ఇబ్బందులు, ఆన్‌లైన్ చేయడంలో జాప్యంతో గతంలో సొమ్ముల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తేవి. ఒక్కోసారి గడువులోగా సొమ్ములు పడక రైతులు ఇబ్బంది పడేవారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ ఈ క్రాఫ్ డేటా ఆధారంగా ఆధార్ ఎనేబిల్డ్ పేమెంట్ సిస్టంను ప్రభుత్వం తీసుకువచ్చింది. ధాన్యం సేకరణపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం ద్వారా నిర్ణీత సమయానికి కంటే ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమవుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 68,163 రైతుల నుంచి రూ.924 కోట్లు విలువైన 4.24 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయగా ధాన్యం మిల్లుకు తరలించిన మూడు నుంచి ఏడు రోజుల లోపే రైతుల ఖాతాలకు సొమ్ములు జమవుతూ వచ్చాయి. ఇప్పటి వరకు రూ.897.37 కోట్ల చెల్లింపులు చేశారు. మిగిలినవి వారంలోపు సేకరించిన ధాన్యం కావడంతో ఒకటి రెండు రోజుల్లో వాటికి సొమ్ములు జమ కానున్నాయి. గోనె సంచులు, రవాణ, లేబర్ చార్జీలకు సంబంధించి రూ.25 కోట్లకు గాను ఇప్పటికే రూ.24.5 కోట్లు చెల్లించారు. ధాన్యం సేకరణలో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడటంతో పాటు వారం రోజుల్లోనే తమ చేతికి ధాన్యం సొమ్ములు అందుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన ధాన్యాన్నీ సేకరిస్తాం

జిల్లాలో ఇప్పటివరకు రూ.924 కోట్ల విలువైన 4.24 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా సేకరిస్తాం. వారం రోజుల్లోనే రైతుల ఖాతాలకు ప్రభుత్వం ధాన్యం సొమ్ములు జమ చేస్తోంది. రైతులకు ఏ దశలోనూ ఇబ్బంది లేకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాం.

–టి.శివరామప్రసాద్, డీఎం, సివిల్ సప్లయిస్, పశ్చిమగోదావరి

మూడు రోజుల్లోనే సొమ్ములు



ఎకరా సొంత భూమి సాగు చేస్తున్నాను. ఎప్పుడూ లేనివిధంగా సీఎం జగన్ వచ్చాక రైతుభరోసా ఇస్తుండటంతో సాగుకు అప్పులు చేయాల్సిన పనుండటం లేదు. సార్వాలో 30 బస్తాల ధాన్యం మిల్లుకు తరలిస్తే మూడు రోజుల్లోనే సొమ్ములు అకౌంట్‌లో జమయ్యాయి.

–పోతుమూడి మరిణియ్య, రైతు, పోడూరు

రైతులకు ఎంతో మేలు



నాలుగు ఎకరాలు కౌలు సాగు చేస్తున్నాను. సార్వాలో 135 బస్తాల దిగుబడి వచ్చింది. ఆర్‌బీకే ద్వారా ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోనే ధాన్యం సొమ్ములు నా అకౌంట్‌కు జమయ్యాయి. ఈ విధానం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– తండా ఇస్సాక్‌రాజు, శివదేవుని చిక్కాల, కౌలురైతు

దళారుల బెడద లేదు



ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. దళారుల బెడద ఉండటం లేదు. నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. తొలకరి ధాన్యం మిల్లుకు తోలిన పది రోజుల్లోనే నా ఖాతాకు ప్రభుత్వం ధాన్యం సొమ్ములను జమచేసింది.

– సర్వేశ్వరరావు, రాయకుదురు

అన్నివర్గాల మద్దతు వైఎస్సార్‌సీపీకే..





తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కాపు సంఘ నాయకులు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు
- కాపు సంఘ నాయకుల చేరిక

పెనుగొండ: రాష్ట్రంలో అన్నివర్గాల మద్దతు వైఎస్సార్ సీపీకే దక్కుతుందని, ప్రతిఒక్కరూ మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో పెనుగొండ మండలం తామరాడకు చెందిన కాపు సంఘ నాయకులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో దిరిశాల సురేష్, పడవల సుబ్బారావు, కొమ్ముల దుర్గారావు, కొమ్ముల నాగేంద్ర, మానేపల్లి రమాసత్యనారాయణ, దిరిశాల నాగు, మద్దూరి రామకృష్ణ, తోట రాంబాబు, బోణం సత్యానారయణ, మేంతే వెంకన్న, మాకినీడి వీరాబాబు, మాకినీడి మణికంఠ, గాజుల సతీష్, మండా రమేష్, మాకినీడి వీర్రాజులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), పార్టీ నాయకులు కానూరి ధన రాంబాబు, కుసుమే రాంబాబు, మద్దూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కందరవల్లి నుంచి.. ఆచంట మండలం కందరవల్లి నుంచి కాపు సంఘ నాయకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గంధం సూర్యనారాయణ, బోడపాటి వెంకటేశ్వర్లు, గంధం వీర వెంకట సత్యనారాయణ, బోడపాటి శ్రీను, ఎర్రగొప్పుల ధర్మారావు, బోడపాటి సూర్యనారాయణ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, పార్టీ అధ్యక్షుడు బోడపాటి సత్యనారాయణ, యర్రగొపుల లక్ష్మీనారాయణ, రావి నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన చంద్రమౌళి



చంద్రమౌళిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్. చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఎంపీ అభ్యర్థి సునిల్‌కుమార్ యాదవ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నవ సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి వైఎస్సార్‌సీపీలో చేరడంతో పాటు తమ పార్టీని వైఎస్సార్‌సీపీలో విలీనం చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చంద్రమౌళికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో పేదల పక్షపాతిగా వారి సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అమలు చేయడం తనను విశేషంగా ఆకర్షించిందన్నారు. అలాగే దళితుల అభివృద్ధికి చేస్తున్న విశేష కృషి అభినందనీయమని, సీఎం జగన్ హయాంలోనే రాష్ట్రంలో దళితులకు అత్యంత రక్షణ కలుగుతోందన్నారు. విద్య ద్వారానే పేదల జీవితాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వ విద్యారంగాన్ని విశేషంగా అభివృద్ధి చేస్తున్నారని, పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతో పాటు విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, గోరుముద్ద వంటి వినూత్న పథకాలను అమలు చేసి దేశంలోనే ఆదర్శప్రాయంగా ప్రభుత్వ విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్లడం చరిత్రాత్మకమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

కాంతులు నింపిన ఆసరా

రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలుచేస్తున్నారు. ప్రతి పథకంలోనూ వారిని భాగస్వామ్యం చేస్తూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆచంట, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు.

–పెనుగొండ/పాలకొల్లు అర్బన్/కాళ్ల



తూర్పుపాలెంలో ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

తెల్లారకుండానే పింఛన్



గతంలో రూ.200 పింఛన్ కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. ఇప్పుడు తెల్లారకుండా రూ.3 వేల పింఛన్‌ని సీఎం జగన్ వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా నాకు లబ్ధి కలిగింది. ఇంటికే వైద్యుడిని పంపించి వైద్యం అందిస్తున్నారు. ఇంత గొప్ప మేలు చేస్తున్న సీఎం జగన్‌నే మరలా గెలిపించుకుంటాం.

– పడ్డి రాజేశ్వరి, పాలకొల్లు

సీఎం జగన్‌పై విశ్వాసం



సీఎం జగన్ నా కొడుకులాంటి వారు. ఆరోగ్యశ్రీలో రూ.5 లక్షల విలువైన గుండె ఆపరేషన్ చేయించారు. రూ.500కే నాకు ఉచితంగా టిడ్కో ప్లాట్ ఇచ్చారు. రూ.1 కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయించారు. సీఎం జగన్‌పై సంపూర్ణ విశ్వాసంతో ఉన్నాం. మరలా ఆయన్ను తప్పక ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– బడే బేబీ సరోజిని, పెంకుళ్లపాడు

పేదలకిచ్చిన మాట ప్రకారం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మహిళలంతా ఆశీర్వదిస్తున్నారు. పేదలకిచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

(కాళ్ల మండలం పెదఅమిరంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



కాళ్ల మండలం పెదఅమిరంలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

మహిళల ఆర్థిక పరిపుష్టికి..

మహిళలకు సామాజికంగా, రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారికి ఆర్థిక పరిపుష్టిని కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారు.

– చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట ఎమ్మెల్యే

(తూర్పుపాలెంలో బుధవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



తూర్పుపాలెంలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

అన్నివర్గాల అభివృద్ధి

రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి

(పాలకొల్లులో బుధవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



పాలకొల్లులో ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీసీ శాంతకుమారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహనాన్ని నడిపే ప్రతిఒక్కరూ డ్రైవర్ కాలేరని రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించినవారే నిజమైన డ్రైవర్ అవుతారని ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరు డీటీసీ కార్యాలయంలో ఆటో, క్యాబ్, విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి రోడ్డు ప్రమాదాలను సగానికి తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయన్నారు. డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకు కంటి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. అతివేగం, మద్యం వంటి మత్తు పానీయాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 95 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల, మిగిలిన 5 శాతం రహదారి నిర్వహణ లోపం వల్ల జరుగుతున్నాయన్నారు. ఏలూరు ఆశ్రమం ఆస్పత్రి మేనేజర్ ఇల్లి రమేష్‌బాబు నేతృత్వంలోని 15 మంది వైద్య బృందం 300 మందికి పైగా డ్రైవర్లకు కంటి, గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఆర్టీఓలు కె.శ్రీహరి, ఎండీ మదానీ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు జి.స్వామి, వై.సురేష్‌బాబు, పి.నరేంద్రబాబు, వీఎల్.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. మోతాదు మించితే బరువు

- సాగులో అవసరం మేరకే వినియోగించాలంటున్న నిపుణులు
- విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దని సూచన
- చీడపీడలు విజృంభించే ప్రమాదముందని హెచ్చరిక
- జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి నాట్లు పూర్తి


వీరవాసరం మండలం తోకలపూడిలో దాళ్వా వరి పైరు

భీమవరం: పంట దిగుబడిని పెంచడంలో ఎరువుల పాత్ర చాలా కీలకం. సార్వా పంటకంటే దాళ్వాలో రైతులు ఎక్కువగా ఎరువులు వినియోగిస్తుంటారు. అయితే వరి పైరులో అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో రైతులు మితిమీరి ఎరువులు వేయడం వల్ల చీడపీడలు విజృంభించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 2.23 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగును రైతులు చేపట్టగా, ఇప్పటివరకు దాదాపు 1,97,370 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల పోషకాలతో పాటూ జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు కూడా చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడం తోపాటు చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువకావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో వివిధ రకాల ఎరువుల్లో ఉన్న పోషకాల మోతాదు, వాటి ఉపయోగాలు, ఎరువులు వేయాల్సిన సమయంపై రైతులు అవగాహన ఏర్పరుచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎకరా వరికి ఏమేం అవసరమంటే..

ఎకరా వరికి 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ, రెండో దఫా పిలకలు కట్టే దశలోనూ, చివరి దఫా అంకురం దశలోనూ వేసుకోవాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

దిగుబడులపై ప్రభావం



దాళ్వా పంటలో రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలని ఎరువులను ఎక్కువగా వినియోగించడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమేగాక చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముంది. వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– డాక్టర్ ఎంపీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

నత్రజని ఎరువు వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతగా పనిచేయాలంటే బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి 2 రోజులు నిల్వ ఉంచిన తరువాత పొలంలో చల్లుకోవడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క దృఢంగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మపోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 – 5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

ఇనుప ధాతు లోపం

సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలల్లోనూ, మెట్ట నారుమడులు వేసే ప్రాంతాలు, అధిక వర్షాలు కురిసిన తరువాత నీరు నిలిచిన పొలాల్లోనూ ఇనుప ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో ముందుగా లేత ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమేపీ ఆకు అంతా తెల్లగా మారి ఎండిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో 'అంబాజీపేట' చిత్ర యూనిట్ సందడి


శ్రీవారి ఆలయంలో అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్ర బృందం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రంలో అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. సినిమా విజయవంతం కావడంతో చిత్ర హీరో సుహాస్, హీరోయిన్ శివానీ నగరం, దర్శకుడు దుశ్యంత్ కటికినేని, నటులు శరణ్య, నితిన్ క్షేత్రాన్ని సందర్శించారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. తరువాత దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు వారికి చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పలువురు భక్తులు హీరో, హీరోయిన్‌లతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

ఉండి: అప్పుల బాధ తట్టుకోలేక ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం బీసీ ఏరియాకు చెందిన గలావిల్లి గిరి భార్య మహేశ్వరి (45) కుటుంబ అవసరాల నిమిత్తం తన ఇల్లు తనఖా పెట్టింది. అయితే అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో దిక్కుతోచని స్థితిలో మంగళవారం ఉదయం కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మహేశ్వరి మృతి చెందింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా ఏఎస్సై ఎ.సూర్యనారాయణ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

- డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్
- సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలతో అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ప్రతి వ్యక్తీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పొందాలని, లేకపోతే భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాసదన్ భవన్‌లో గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు, వీఆర్వోలతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వివాహాల రిజిస్ట్రేషన్ చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక శిశువు జన్మించిన వెంటనే సంబంధిత కార్యాలయంలో జనన తేదీలను నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల పాఠశాలలో ప్రవేశానికి, ఉద్యోగాల దరఖాస్తుకు, విదేశాలకు పాస్‌పోర్టు దరఖాస్తుకు, ప్రభుత్వ పథకాలను పొందడంలో జనన ధ్రువీకరణ ఉపయోగపడుతుందన్నారు. అలాగే మరణ ధ్రువీకరణ పత్రం వారసులకు ఆస్తుల బదిలీ విషయంలో తప్పనిసరిగా అవసరం అవుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించి వారికి సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అందించాలన్నారు. అలాగే మున్సిపాలిటీలలో, పంచాయతీ ఆఫీసులలో తగిన ఆధారాలు సమర్పించి నమోదు చేయించుకుని వివాహ రిజిస్ట్రేషన్ల ధ్రువీకరణ పత్రాలను పొందాలని సూచించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ వివిధ పంచాయతీలలో పేరుకుపోయిన బకాయిలను పర్మినెంట్ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. బకాయిల వసూలు అవసరమైన పక్షంలో ప్రజాప్రయోజన శాశ్వత సేవల లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య, ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


దివ్యాంగ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఏడీ పి.రాకడ మణి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ పి.రాకడ మణి అన్నారు. చెవిటి మూగ దివ్యాంగురాలైన బీకాం మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న మేలే లీలాంబికకు ల్యాప్‌టాప్‌ను స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో బుధవారం ఆమె అందజేశారు. ఏడీ మాట్లాడుతూ దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు అందించడం ద్వారా వారికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం దివ్యాంగులైన విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పించిందని, ఇందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం వరిఘేడు గ్రామానికి చెందిన మేలే లీలాంబికకు ల్యాప్ టాప్ అందించడం జరిగిందన్నారు. ఆమె విద్యకు ల్యాప్‌టాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఏడీ అన్నారు.

తాడేపల్లిగూడెంలో భారీ చోరీ

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని యాగర్లపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 24వ వార్డు యాగర్లపల్లి ప్రాంతంలో యాగర్లపల్లి రాము కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేరే ఊరులో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులకు వేసిన తాళాలు తీసి ఉండటంతో కంగారుగా ఇంటిలోకి వెళ్లిచూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో లాకరులో దాచిన 20 కాసుల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల నగదు కనిపించలేదు. బాధితుడు రాము ఫిర్యాదు చేయగా సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితో డ్వాక్రా సొమ్ము జమ


ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న డ్వాక్రా మహిళలు

ఆగిరిపల్లి: ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో సగ్గూరు, నరసింగపాలెంలోని డ్వాక్రా సంఘాల మహిళల సమస్య పరిష్కారమైంది. వివరాల్లోకి వెళితే.. కొన్ని నెలల క్రితం సగ్గూరుకు చెందిన బిజినెస్ కరస్పాండెంట్లు శైలజ, నరసింగపాలెంకు చెందిన అర్జున్‌రావు డ్వాక్రా మహిళలు రుణ వాయిదాల నిమిత్తం ఇచ్చిన రూ.కోటి 8 లక్షలు సొమ్మును బ్యాంకుకు చెల్లించకుండా తమ సొంత అవసరాలకు వాడుకున్నారు. వీరిపై అప్పట్లో కేసు నమోదైంది. బ్యాంక్ కరస్పాండెంట్ల మోసంపై డ్వాక్రా మహిళలు ఆందోళన చెందవద్దని, బ్యాంకు అధికారులతో చర్చించి డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మహిళలకు భరోసా ఇచ్చారు. మంగళవారం విజయవాడలోని యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌తో ఎమ్మెల్యే చర్చలు జరిపగా, మధ్యవర్తి ఇంటిగ్రా కంపెనీ ద్వారా రెండు గ్రామాలకు చెందిన 55 డ్వాక్రా గ్రూపులకు రూ.90 లక్షలు జమ చేశారు. డ్వాక్రా సొమ్మును మహిళల ఖాతాల్లో జమ చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావుకు మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ కొండ వరదలు రమేష్, సర్పంచులు కేఎస్ఎస్ దిలీప్, అనూష, పీఏసీఎస్ అధ్యక్షులు పొన్నం రామచంద్రరావు, మోగదాటి పురుషోత్తం, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం, నవాబుపాలెం మధ్య చెట్టుకు ఉరివేసుకుని ఓ గుర్తు తెలియని వ్యక్తి (30) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వివరాలు తెలియలేదని, మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలో తిరిగినట్లు, అర్థం కాని భాషలో మాట్లాడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.సురేష్ చెప్పారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో వర్జీనియా పొగాకు బ్యారన్ బుధవారం దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సబ్బంపేట రోడ్డులో మాణికల నాగేశ్వరరావుకు పొగాకు బ్యారన్ ఉంది. ఈ బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో పొగాకు పూర్తిగా కాలిపోయిందని, సుమారుగా ఆస్తి నష్టం రూ.ఆరు లక్షలు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా అయినవిల్లి వినాయక విజయ హోమం


విశేష అలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరుడు

దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీబలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రసిద్ధి చెందిన అయినవిల్లి వినాయక విజయ హోమాలు నిర్వహించారు. తొలుత వినాయకునికి హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. ఈ హోమాన్ని చూసి తరించేందుకు పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. హోమం అనంతరం ప్రత్యేక అలంకరణలో దివ్యమూర్తి శ్రీవినాయకుని దర్శనం చేసుకున్నారు. భక్తులకు స్వామివారి అక్షింతలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ రవిశంకర్, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, కర్రి భాస్కర రావు, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, గార్లపాటి వీరబాబు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్ పర్యవేక్షించారు. – తాడేపల్లిగూడెం అర్బన్


అయినవిల్లి వినాయక విజయ హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు


బలుసులమ్మ ఆలయ ఆవరణలో కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

సొసైటీ లాకర్‌లో బంగారం మాయం

తణుకు: సొసైటీ లాకర్‌లో దాచుకున్న రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు మాయం కావడం చర్చనీయాంశంగా మారింది. తణుకు మండలం దువ్వ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యన్నమని ఉమాదేవి దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2012లో రూ.8 వేలు డిపాజిట్ చెల్లించి 23 నంబర్ లాకర్ తీసుకున్నారు. 2018లో ఆమె వద్ద ఉన్న రూ.40 లక్షల విలువైన 806 గ్రాముల బంగారు ఆభరణాలను సొసైటీకి చెందిన లాకర్‌లో భద్రపర్చారు. ఈ నెల 6న లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకునేందుకు ఆమె సొసైటీకి వెళ్లారు. లాకర్‌లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె లబోదిబో మంటూ కన్నీటిపర్యంతమై సొసైటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. లాకర్ల వద్దకు వచ్చి చూసిన అధికారులు లాకర్ కీ మా వద్ద ఉండదని, మీ వద్దే ఉంటుందని, పోయిన మీ బంగారంతో సొసైటీ లాకర్ల నిబంధనల ప్రకారం మాకు ఎటువంటి సంబంధం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమె తణుకు రూరల్ పోలీసులకు, సొసైటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్, సిబ్బందితో సొసైటీకి వెళ్లి పరిశీలించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామని వెల్లడించారు.

నేటి నుంచి విద్యుత్ అవగాహన సదస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, ఏలూరు సర్కిల్ పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని మండలాల్లోని సెక్షన్ కార్యాలయాల్లో గురువారం నుంచి విద్యుత్ వినియోగదారులు, రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్లు ఏలూరు సర్కిల్ ఎస్ఈ పీ సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖతో కలిసి నిర్వహించే ఈ సదస్సుల్లో విద్యుత్ వినియోగంలో రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కొత్త వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకుని నిర్దేశించిన ఎస్టిమేట్ చార్జీలను డీడీ రూపంలో చెల్లించి తగిన రశీదును పొందాలన్నారు. అదనంగా ఏ విధమైన సొమ్మును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అదనంగా సొమ్ము, లంచంగా అధిక సొమ్ములు అడిగితే విద్యుత్ సమస్యల టోల్‌ఫ్రీ నంబర్ 1912కు లేదా దగ్గరలోని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



తేతలి ఏఎస్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భవన నిర్మాణ కార్మికులు ఆధునిక పరికరాలు వినియోగంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని ఏఎస్ఆర్ కళాశాలలో ప్రధాన మంత్రి విశ్వ కర్మ యోజన పథకంలో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులు పంది కొండయ్య, బండారు నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుకారుస్తుందని, కాపాడుకుందామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం జిల్లా సంఘం సమావేశం సంఘ అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సభ్యత్వాలు నమోదు, తదితర కార్మిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, నాయకులు టీవీఎస్ రాజు, మండల నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

శారదరాణికి ఉమెన్ ఆఫ్ నేషనల్ వామ్ అవార్డు



పచ్చిపులుసు నాగ శారద రాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ అపరాజిత ఉమెన్ ఆఫ్ నేషనల్ వామ్ అవార్డుకు తాడేపల్లిగూడెంనకు చెందిన ఆర్యవైశ్య మహిళా, మహాసభ వైస్ ప్రెసిడెంట్ పచ్చిపులుసు నాగ శారద రాణి ఎంపికయ్యారు. చెన్నైలో ఫిబ్రవరి 10వ తేదీన నేషనల్ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌లో శారదకు అవార్డు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా శారదరాణిని పలువురు ఆర్య వైశ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హౌసింగ్‌బోర్డు 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ రైల్వే ఫీడర్ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8వ తేదీన గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరావు తెలిపారు. జూబ్లీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆస్పత్రి ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు: తణుకు పట్టణంలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తణుకు పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. రాష్ట్రపతిరోడ్డు, బ్యాంకు కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, వేల్పూరు రోడ్డు, సజ్జాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీరల పంపిణీ



అత్తిలిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, రెల్లికులస్తులకు అండగా ఉంటున్న కూసంపూడి మూర్తి అందిస్తున్న సేవలు మరువరానివని రెల్లి సంఘ సభ్యులు పేర్కొన్నారు. కూసంపూడి మూర్తి, శిరీషా దంపతుల కుమార్తె అవంతిక పుట్టిన రోజు సందర్భంగా అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో గల కూసంపూడి పెద కాపు పార్కులోపేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు భోజన సదుపాయాన్ని అందజేశారు.

ఆడబిడ్డకు కల్యాణమస్తు

- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా
- కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలతో లబ్ధి



పెంటపాడు: ఆడపిల్ల పెళ్లంటే పేద కుటుంబాలకు ఎంత భారమో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. పెళ్లిపత్రిక ముద్రించడం మొదలు వధూవరులకు నూతన వస్త్రాలు, తాళిబొట్టు, పెళ్లి మండపం, భోజనాలు, బాజాభజంత్రీలు..ఒక్కటేమిటి సవాలక్ష ఖర్చులుంటాయి. ఈ క్రమంలోనే పెళ్లితంతు పూర్తయ్యేసరికి పేదింటి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. అందుకే పేదలు తమ పిల్లలకు వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించే సామాజిక బాధ్యతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిజేస్తోంది.

పకడ్బందీగా మార్గదర్శకాలు

రాష్ట్రంలో బాలికా విద్యను ప్రోత్సహించేలా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ఈ పథకాలను రూపొందించడం విశేషం. దీని కోసం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల్లో లబ్ధి పొందాలంటే వధూవరులు కనీసం పదో తరగతి చదివి ఉండాలన్న నిబంధన విధించారు. బాల్య వివాహాల నిరోధానికి వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు నిండాలన్న నిబంధనల విధించారు. దరఖాస్తుకు వధూవరుల ఆధార్ కార్డులు, టెన్త్ మార్కుల జాబితా, ఇద్దరి ఈ మెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, తల్లితండ్రి లేదా సంరక్షకుల ఆధార్ జిరాక్స్ కాపీలు, పెళ్లి ఫోటోలు, మ్యారేజ్ సర్టిఫికేట్, వివాహ పత్రిక, వివాహ సమయంలో తీసిన ఫోటోలు, దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. రెండో వివాహం చేసుకునే పెళ్లి కుమార్తె తన మొదటి భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదా వితంతు పింఛన్ కార్డు జిరాక్స్ అందజేయాల్సి ఉంటుంది. నమోదు చేసిన వెంటనే అప్లికేషన్ ఐడీ నంబర్ లబ్ధిదారుల మొబైల్ నంబర్‌కు వస్తుంది., పెళ్లయిన 60రోజుల్లోగా ఈ పథకానికి ఎన్‌బీఎం పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తు వార్డు లేదా గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌కు వెళ్తుంది. సదరు అధికారి దరఖాస్తును పరిశీలించి వధూవరుల బయోమెట్రిక్, ఈకేవైసీ తీసుకొని ప్రభుత్వ సాయం అందేలా చూస్తారు.

ఆర్థిక సాయం ఇలా..

వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు లబ్ధి అందజేస్తున్నారు. ఏటా నవంబరు 1వ తేదీ నుంచి జనవరి నెలాఖరువరకూ దరఖాస్తు చేసుకున్నవారికి ఫిబ్రవరిలో ఫిబ్రవరి 1నుంచి ఏప్రిల్ 30వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి మే నెలో, మే 1నుంచి జులై 31 వరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆగస్టులో, ఆగస్టు 1న నుంచి అక్టోబర్ 31వరకూ దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరులో ఆర్థిక సాయం అందజేస్తారు. ఎస్సీ సమాజిక వర్గానికి చెందినవారైతే రూ.1లక్ష చొప్పున, ఎస్టీలకు కులాంతర వివాహం చేసుకున్నవారికైతే రూ.1.20 లక్షలు, బీసీలకైతే రూ.50వేలు, బీసీను కులాంతర వివాహం చేసుకున్నవారైతే రూ.75 వేలు, మైనార్టీకు రూ.1చొప్పున, మైనార్టీలను కులాంతర వివాహం చేసుకున్నవారైతే రూ.1.20 లక్షలు, దివ్యాంగులకు రూ.1.50లక్షల చొప్పున, భవన నిర్మాణ కార్మికులైతే రూ.40వేలు చొప్పున అందిస్తున్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించేలా నిబంధనలు



ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు ఆర్థిక సాయం జమచేస్తారు. బాల్య వివాహాలను అరికట్టి, బాలికా విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది.

– సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో పెంటపాడు

బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్



తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులతో ఎంఈవో హైమావతి

తణుకు అర్బన్: ఒకేషనల్ విద్యలో ఇండస్ట్రియల్ విజిట్ కీలకభూమిక పోషిస్తుందని తణుకు మండల విద్యాశాఖాధికారి హైమావతి అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ 9, 10 తరగతి విద్యార్థులను ఒకేషనల్ విద్యలో భాగంగా బుధవారం పైడిపర్రులోని టీవీఎస్ బైక్ షోరూంను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్స్ అంశాలను ఇప్పుడే తెలుసుకుంటే భవిష్యత్తులో డిప్లొమో కోర్సుల్లో మంచి అనుభవం సంపాదించవచ్చని అన్నారు. పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఒకేషనల్ ట్రైనర్స్ డి.మూర్తి, బి.దిసేంద్ర, ఉపాధ్యాయులు, షేరీఫ్, దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



కెవికెలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం: ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమం కింద దత్తత గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాల గురించి బుధవారం వెంకట్రామన్నగూడెంలోని కెవికెలో సమావేశం జరిగింది. దత్తత తీసుకున్న వీరంపాలెం, పెదతాడేపల్లి, జగన్నాథపురం, ఆరుగొలను, కడియద్ద గ్రామాలలో గ్రామసర్వే, గృహసర్వేలను చేయాలనే కార్యాచరణలో భాగంగా సమస్యలను గుర్తించి, ఆ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదే గ్రామీణాభివృద్ధికి పాటుపడటమే ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యమని వర్సిటీ అధికారులు తెలిపారు. బుధవారం వెంకట్రామన్నగూడెంలో రహదారులు, డ్రైనేజీ ,నీటి సదుపాయాలు, పైపు లైన్ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ప్రాంతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పావని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, కెవికె శాస్త్రవేత్తలు వి.దీప్తి, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగంగా పూర్తి చేయాలి



తేతలి సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో

తణుకు టౌన్: పేదల అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇచ్చిన పట్టాలను ఆయా సచివాలయాల్లో వేగంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఎంపీడీవో డీ శ్రీలలిత చెప్పారు. తణుకు మండలం తేతలి గ్రామంలోని సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అర్హత ఉన్న వారందరికీ వారి పేరున స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. సర్వర్లు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఇప్పటి వరకూ గ్రామంలో 260 పట్టాలను రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన కుల గణన రీ వెరిపికేషన్ ప్రక్రియ పరిశీలించారు. అదే విధంగా గ్రామంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు వెంకట నారాయణ, ఎం డాక్టర్ బాబు, సిచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంవీఐ డీఎస్ఎస్ నాయక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రహదారి భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంవీఐ డి.ఎస్.ఎస్ నాయక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా బుధవారం ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన డ్రైవర్లుకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ డ్రైవింగ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలను, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పక పాటించాలన్నారు. ఇంధన పొదుపు కోసం బ్రేక్‌ను అదుపు చేయాలని తదితర విషయాలను అవగాహన చేశారు. కుటుంబ శ్రేయస్సును ప్రతి డ్రైవరు గుర్తించుకోవాలన్నారు. యేలూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రయాణీకులందరూ ఆర్టీసీపై ఎంతో నమ్మకం ఉంచారని, సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్యారేజీ సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు నాయకులు రమణ, చిట్టిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సామాజికాభివృద్ధి

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆసరా సంబరాల్లో గుడాల గోపి పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యరంగాలకు పెద్ద పీట వేయడంతో పాటు మహిళలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించి వారిని మహారాణులుగా తీర్చిదిద్దారన్నారు. నవరత్నాల పథకాలను ప్రకటించి 33 పథకాల ద్వారా ప్రజలకు ఇంటింటికీ సంక్షేమం అందించారన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలని 124 సార్లు సీఎం జగన్ బటన్ నొక్కారని, అయితే ఆయన కోసం మనం ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. 17 నుంచి 24 వార్డులకు చెందిన డ్వాక్రా మహిళలకు ఆసరా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని 21వార్డుకి చెందిన పలువురు మహిళలు ఆసరా సంబరాల ప్రాంగణంలో నృత్యాలు చేసి అలరించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సాలా దేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వనుం సత్య కళ్యాణి, సచివాలయ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీగంగా పవన్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ చట్టాలపై శిక్షణ



అత్తిలి: తిరుపతిపురంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి



తాడేపల్లిగూడెం రూరల్: బేటి బచావో కార్యక్రమం



తాడేపల్లిగూడెం(టీఓసీ): బేటి బచావో, బేటి పఢావో ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థులు



పెంటపాడు : సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

అత్తిలి: బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తిరుపతిపురం గ్రామంలో సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లలను ఎదగనిద్దాం–ఆడపిల్లలను చదవనిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి పార్వతి, లలిత, చంద్రిక, మాధవి పాల్గొన్నారు.

బాలిక విద్యను ప్రోత్సహిద్దాం

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం గ్రామంలో బేటి బచావో, బేటి పఢావో కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అధ్యక్షతన బుధవారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ర్యాలీ జరిగింది. అనంతరం తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఫణీంద్ర, వీఆర్ఓ నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పలు వార్డుల్లో బేటి బచావో, బేటి పఢావో ర్యాలీలు బుధవారం 5,6,11,12 వార్డుల్లో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అంటూ నినాదాలు చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. తల్లిదండ్రులకు బాలికల హక్కులు కాపాడాలని, వారి చదువులకు, ఉపాధి కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సచివాలయం సెక్రటరీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి

పెంటపాడు: ఆడపిల్లలు బాగా చదువుకొని అన్ని రంగాల్లో ముందుండాలని పెంటపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవాని, సుజాత, బీజీబీ విజయలక్ష్మిలు పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండంలో పలు గ్రామాల్లో జరిగిన సెక్టార్ సమావేశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగంలో మహిళలు ఎంతగానో రాణిస్తున్నారన్నారు. అందరికి సమానత్వపు హక్కులు అందించేలా ప్రత్యేకంగా తండ్రులు, భర్తలు స్త్రీలను ప్రత్యేకంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పెంటపాడు, ముదునూరు ప్రాథమిక వైద్యాధికారులతో పాటు, ఆయా గ్రామాల ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలంపురంలో నేడు ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ ఆస్పత్రిలో ఈనెల 8న ఉదయం 10 గంటలకు పలువురు ప్రముఖ వైద్యులతో ఆరోగ్యసేవలు ఉచితంగా అందజేస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు కార్డియాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల పరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడూరి ఉమాబాలకు అభినందనలు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాలను పార్టీ మహిళా నాయకులు బుధవారం కలసి అభినందనలు తెలిపారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, జిల్లా సెక్రటరీ కూడిపూడి నాగలక్ష్మి, పైలా వరలక్ష్మి, పైలా రాజశ్రీ, నాయకులు కొరు మధు తదితరులు ఉమాబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రకళ, నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఉమాబాలను ఎంపిక చేసి మరోసారి మహిళా పక్షపాతి అని నిరూపించారన్నారు. ఉమాబాల ఘన విజయం సాధించడం ఖాయమని, ఆమెకు తాము సైన్యంగా పనిచేస్తామన్నారు. నర్సాపురం పార్లమెంట్‌ను బీసీ మహిళకు కేటాయించడం అభినందనీయమన్నారు. నాయకులు ముదునూరి సుబ్బరాజు, కై లా పాండురంగరావు ఉమాబాలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం



యండగండిలో కుళాయిని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాబోయే వేసవిలో నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మండలంలోని యండగండి సచివాలయం 2 పరిధిలో సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి ఆధ్వర్యాన జల్ జీవన్ నిధులు రూ.33 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను (ఓహెచ్ఎస్ఆర్) బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో పీవీఎల్ తాగునీటి సరఫరాపై సమావేశమయ్యారు. అక్కచెల్లెమ్మలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆర్థికంగా వారికి జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగ్గరాజు, వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, వార్డు సభ్యులు గన్నాబత్తుల తావుడు, కాల రామావతారం, పంచాయతీ కార్యదర్శి కె.పవన్ కుమార్, సచివాలయ కన్వీనర్ వేణు, కాల సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జి.సుందర్‌కుమార్, గ్రామ పెద్దలు మంతెన రామరాజు, నంబూరి సత్యనారాయణరాజు, వరహాలరాజు, వెంకటరాజు, సాంబరాజు, కృష్ణ, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఉండి మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే ఉమా మాణిక్యాంబకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.30 లక్షలు మంజూరు కాగా, బుధవారం పెద అమిరంలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెక్కు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు వర్రె పైడియ్య, సర్పంచ్ కేశన శాంతకుమారి, మాజీ సర్పంచ్‌లు తాటిపర్తి పెద వీరప్ప, నక్కా చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

కాళ్ల: మండలంలోని కోమటికుంటకు చెందిన పసుపులేటి సత్యనారాయణకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షా 30 వేలు మంజూరు కాగా, లబ్ధిదారుకు పీవీఎల్ నర్సింహరాజు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బోనం శివకుమార్, బర్రె మునలయ్య పాల్గొన్నారు.

9న జాతీయ నులిపురుగుల నిర్మూలన

అత్తిలి: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ఈనెల 9న అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు తెలిపారు. కేంద్రం పరిధిలో 34 అంగన్‌వాడీ కేంద్రాల్లో, 25 పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలలు, 2 కళాశాలలోగల 6,451 మందికి డివార్మింగ్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషకలోపం, ఆకలిమందగించడం, నీరసం, కడుపునొప్పి, బరువుతగ్గడం వంటి సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగాలన్నారు.

బలహీన వర్గాల ద్రోహి చంద్రబాబు

- సామాజిక న్యాయం జగనన్నకే సాధ్యం
- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీఈసీ చైర్మన్ పెండ్ర వీరన్న

భీమవరం(ప్రకాశం చౌక్): చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ద్రోహి అని సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న విమర్శించారు. బుధవారం భీమవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ పక్షపాతిగా సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాజకీయంగా బీసీలను చైతన్యం చేయడంలో భాగంగా ఏలూరు ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు, విద్యావేత్త కారుమూరి సునీల్‌కుమార్‌ను, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గూడూరి ఉమాబాల, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేసి మరోసారి బీసీల పక్షపాతిగా ఆయన నిరూపించారన్నారు. చింతలపూడిలో టీడీపీ రా.. కదిలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఏలూరు ఎంపీగా ఉన్న కోటగిరి శ్రీధర్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను విమర్శించడం ఖండిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర మంత్రులను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. తాను అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసి వారిని అవమానించారన్నారు. 2020లో వర్ల రామయ్యను రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి పెట్టి తీవ్రంగా అవమానపరిచిన చరిత్ర చంద్రబాబు దన్నారు. సీఎం జగన్ ఎస్సీ వర్గానికి చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యేగా ఉన్న గొల్ల బాబూరావును రాజ్యసభకు పంపుతున్నారన్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లా పాయికారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న వంగలపూడి అనితను కొవ్వూరు నియోజకవర్గంలో పోటీకి పెట్టి, అప్పటి మంత్రిగా ఉన్న కొత్తపల్లి జోహార్‌ను తిరువూరులో పోటీ చేయించి అవమానపరిచిన చరిత్ర చంద్రబాబుకి దక్కుతుందన్నారు. అలాగే బీసీ వర్గాలకు చెందిన మత్స్యకారులు విశాఖపట్నంలో చంద్రబాబుకు వినతి పత్రం ఇవ్వటానికి వెళ్తే తోకల కత్తిరిస్తానని, నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు చంద్రబాబును కలవడానికి ఏపీ సచివాలయానికి వెళ్తే తోలు తీస్తామని అవమానపరిచిన చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ మహిళ గూడూరి ఉమాబాలను ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. చరిత్రలో మొట్టమొదటిసారిగా నరసాపురం నియోజకవర్గం ఎంపీ అభ్యర్థిగా బీసీ మహిళకి అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం, ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థులుగా ఉన్న బీసీ వర్గాలకు చెందిన ముగ్గురిని పార్లమెంటుకు పంపించడానికి ప్రజలందరూ కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో సంచార జాతర సంఘం గౌరవ సలహాదారు గంట వెంకన్న, భీమవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.